జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP సంపుటి : 1 సంచిక: 49 గురువారం 10 జూలై 2025 పేజీలు : 8 వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## ఎర్రవల్లి ఫాంహౌస్ లో చర్చలకు సిద్ధం : సీఎం రేవంత్ రెడ్డి

(సందేశంటైమ్స్, జులై 9) : :తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం తారస్థాయికి చేరింది. ముఖ్యంగా రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై జరుగుతున్న చర్చ ఇప్పుడు "ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ" నిర్వహణ సవాల్ వరకు వెళ్ళింది.బీఆర్ఎస్ నేతలు విసిరిన 'చర్చకు సిద్ధమా?' అనే సవాళ్లకు సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. చర్చకు తాము ఎప్పుడూ సిద్ధమేనని, కానీ అది క్లబ్బుల్లో, పబ్బుల్లో కాదు%ొ% చట్టసభల్లో జరగాలని సీఎం స్పష్టం చేశారు."అసెంబ్లీకి రండి, చర్చిద్దాం. లేదా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కే రండి, అక్కడే మాక్ అసెంబ్లీ పెట్టి చర్చిద్దాం. ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌కు రావడానికి నేను కూడా సిద్ధమే" అంటూ ఆయన బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు.రాష్ట్ర ప్రజల సమస్యలపై చట్టసభలే సరైన వేదికని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. చర్చకు తాము ఎప్పుడు సిద్ధమేనని, బీఆర్ఎస్ నాయకులు మాటలకే పరిమితం కాకుండా చట్టసభల్లో సమస్యలను చర్చించాలని ఆయన సూచించారు.కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం (జులై 8) ఉదయం 11 గంటలకు హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు వచ్చి, రైతుల సమస్యలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ చర్చకు సవాల్ విసిరి, హాజరుకాకపోవడం ద్వారా "జవాబుదారీతనం నుండి తప్పించుకుంటున్నారు" అని, "తన సొంత సవాల్ నుండే వెనకడుగు వేస్తున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి 600 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆయన ఆరోపించారు. సీఎంకు సాగునీటి ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని, తెలంగాణ నీటిని ఆంధ్రప్రదేశ్‌కు మళ్లిస్తున్నారని కూడా ఆయన ధ్వజమెత్తారు.ఈ క్రమంలో, బీఆర్ఎస్ నేతలు చర్చకు సిద్ధమా అంటూ చేసిన సవాళ్లపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. చర్చకు తాము సిద్ధమే అని స్పష్టం చేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహిద్దామని, తాను కూడా అక్కడికి రావడానికి సిద్ధమేనని ప్రకటించారు.



## మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం




విండ్‌హూక్ ,(సందేశంటైమ్స్, జులై 9) : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి మరో అరుదైన గౌరవం లభించింది. నమీబియా పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విచ్చియా మిరాబిలిస్'ను ప్రధానం చేశారు. నమీబియా అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నంది-ఎన్ ద్వైతా (%ణతీ చీవ్‌బఎశీ చీుఅఱ-చీుఖుఙఖుష్త%) ఈ అవార్డును మోదీకి అందజేశారు. నమీబియాతో పాటు ప్రపంచ శాంతి, న్యాయం, సామాజిక ఆర్థిక అభివృద్ధికి మోదీ చేసిన సేవలను అధ్యక్షురాలు ప్రశంసించారు.నమీబియా అత్యున్నత పౌర పురస్కారం 'వెల్‌విచ్చియా మిరాబిలి'తో అందుకోవడం చాలా ఆనందంగా ఉందని మోదీ అన్నారు. నమీబియా అధ్యక్షురాలు, ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంలోని 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఈ పురస్కారాన్ని అందుకుంటున్నానని చెప్పారు. ఇండియా-నమిబియా మధ్య ఎప్పటికీ చెక్కుచెదరని చిరకాల స్నేహం ఉందని, ఈరోజు ఇక్కడ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఇచ్చిన పురస్కారాన్ని నమీబియా, ఇండియా ప్రజలకు అంకితమిస్తున్నానని తెలిపారు. కష్టకాలంలో ఉన్నప్పుడు చేయూత నిచ్చినవారే నిజమైన మిత్రులని, స్వాతంత్ర్య పోరాటం సమయం నుంచి కూడా ఒకరికొకరు బాసటగా ఇండియా, నమీబియా నిలబడ్డాయని చెప్పారు. ఇరుదేశాల మైత్రి రాజకీయాల నుంచి పుట్టిన మైత్రి కాదని, పరస్పరం ఎదుర్కొన కష్టాలు, సహకారం, పరస్పరం విశ్వాసం నుంచి బలపడిందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇరుదేశాలు మైత్రీ సంబంధాలతో అభివృద్ధి పథం దిశగా పయనించనున్నాయని అన్నారు.



## తెలంగాణ పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి..

### మూత బడిన పరిశ్రమల పునఃప్రారంభం పై దృష్టి

### కేంద్ర మంత్రి తో శ్రీధర్ బాబు భేటి

,(సందేశంటైమ్స్, జులై 9) :ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ఈరోజు కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిశారు. ఈ సంద్భంగా తెలంగాణ పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం, రాష్ట్ర యువతకు వృద్ధి చెందిన ఉపాధి అవకాశాలు కల్పించడం రాష్ట్ర అభివృద్ధి అజెండాలో ప్రధాన ప్రాధాన్యతలుగా ఉన్నాయని రాష్ట్ర పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, ఆగిపోయిన కేంద్ర ప్రభుత్వ సంస్థలను పునరుద్ధరించడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు.

## ప్రజల హక్కులను తాకట్టు పెట్టం : రేవంత్ రెడ్డి



### కృష్ణా జలాలపై ప్రజెంటేషన్.. హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,,(సందేశంటైమ్స్, జులై 9) : కృష్ణా, గోదావరి నదీ జలాలపై తెలంగాణ రాష్ట్రం తన హక్కులను ఏ పరిస్థితుల్లోనూ తాకట్టు పెట్టదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈరోజు (బుధవారం) మహాత్మా జ్యోతిరావు ఫూలే ప్రజా భవన్‌లో కృష్ణా జలాల వినియోగం, కేటాయింపులు, భవిష్యత్ అవసరాలపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి సీఎం హాజరై కీలక దిశానిర్దేశం ఇచ్చారు.ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, నిపుణులు ప్రెజెంటేషన్ ఇవ్వగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ప్రజెంటేషన్‌లో కృష్ణా జలాల లభ్యత, వినియోగం, ఆంధ్రప్రదేశ్‌తో ఉన్న జల వివాదాలు, పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాల పురోగతి, ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పరిణామాలు, మేడిగడ్డ వద్ద తలెత్తిన సమస్యలు వంటి అంశాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమగ్రంగా వివరించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలో మేడిగడ్డ ప్రాజెక్టు వల్ల ఏర్పడే ప్రమాదకర పరిస్థితులను కూడా ప్రస్తావించారు.

ప్రజల హక్కులను కాపాడుతాం

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ హక్కులను ఎవ్వరికీ తాకట్టు పెట్టం. ఎంతటి వారొచ్చినా నిటారుగా నిలబడి పోరాడుతాం. ప్రజలు ఒక విశ్వాసం, నమ్మకంతో మాకు అవకాశం ఇచ్చారు. ఈ హక్కుల విషయంలో దేవుడే ఎదురుగా వచ్చినా ఎదురించి ప్రజలకు అండగా నిలబడుతాం," అని ధీమా వ్యక్తం చేశారు.

## హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు అరెస్ట్

హైదరాబాద్,,(సందేశంటైమ్స్, జులై 9) : క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.జగన్మోహన్ రావును క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో 2025 సీజన్‌లో టిక్కెట్లలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై విజిలెన్స్ విచారణ అనంతరం ఈ చర్య చేపట్టారు.సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యంతో జరిగిన వివాదమే ఈ అరెస్టుకు కారణమని తెలుస్తోంది. కాంప్లిమెంటరీ టిక్కెట్లు, కార్పొరేట్ బాక్స్‌లను బ్లాక్‌మెయిల్ చేసి అదనపు టిక్కెట్లు డిమాండ్ చేసినట్లు ఆరోపించింది. మార్చి 27న లక్నో సూపర్ జెయింట్స్ యజమాని సంజీవ్ గోయెంకాకు కేటాయించిన 3 కార్పొరేట్ బాక్స్‌ను జగన్మోహన్ రావు లాక్ చేసి, 20 అదనపు కాంప్లిమెంటరీ టిక్కెట్లు ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు సమాచారం.

## క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



వనపర్తి, ,(సందేశంటైమ్స్, జులై 9) : నూతన ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టిన వారు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. జిల్లాలో నూతన ఎస్ఐలుగా బాధ్యతలు చేపట్టనున్న ఆరుగురితో బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మొదటి సారి ఎస్ఐలుగా బాధ్యతలు చేపడుతున్నారని, ఆ ప్రాంత ప్రజలకు జీవితాంతం గుర్తుండేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

# నదులు అనుసంధానం చేసిన అపర భగీరధుడు చంద్రబాబు : మంత్రి నిమ్మల



ఇబ్రహీంపట్నం, (ఎన్టీఆర్),(సందేశం టైమ్స్జులై 9) : దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నదులు అనుసంధానం చేసిన అపర భగీరథుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద కృష్ణా నదిలో కలుస్తున్న పట్టిసీమ గోదావరి జలాలకు మంత్రి నిమ్మల బుధవారం పసుపు, కుంకుమతో పాటు చీర, సారెలను సమర్పించి జల హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1300 కోట్లతో నిర్మించిన పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలిస్తే రూ.50 వేల కోట్ల ఆదాయం లభించిందన్నారు.2014 - 19 మధ్యకాలంలో 263 టీఎంసీలకు పైగా గోదావరి జిల్లాలో కృష్ణా డెల్టా కు తరలించినట్లు చెప్పారు. ఇది శ్రీశైలం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ అన్నారు. ఇప్పటి వరకు పట్టిసీమ ద్వారా 428 టీఎంసీలకు పైగా కృష్ణా డెల్టాకు తరలించామని, ఇది నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి నీటినిల్వ సామర్థ్యం కంటే ఎక్కువ అన్నారు. నాడు టీడీపీ హయాంలో 1040 లిఫ్ట్ స్కీమ్స్ ద్వారా సాగునీరందిస్తే వైసీపీ హయాంలో సరైన నిర్వహణ లేక 450 లిఫ్టులు మరుగున పడ్డాయని విమర్శించారు.జగన్ ప్రభుత్వం కనీసం ప్రాజెక్టుల నిర్వహణకు, గేట్లకు గ్రీజు పెట్టడానికి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్ మేనేజ్ మెంట్ ద్వారా అన్ని రిజర్వాయర్లలో పూర్తిస్థాయి నీటి నిల్వ చేయగలిగామని చెప్పారు. శ్రీశైలం, ధవళేశ్వరం మరమ్మతులు, నిర్వహణ కోసం రూ.350 కోట్లు నిధులు కేటాయించి శ్రీశైలం గేట్ల ద్వారా వరద నీరు విడుదల చేశామని తెలిపారు. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే జగన్ పాలన వల్ల ఎక్కువ నష్టం జరిగిందని ఆరోపించారు. వెంటిలేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థకు మోడీ సహకారంతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఆక్సిజన్ ఇచ్చి ఊపిరి పోస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ కేబినెట్




అమరావతి,,(సందేశంటైమ్స్, జులై 9): సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రైతాంగానికి కేబినెట్ తీపి కబురు చెప్పింది. ధాన్యం పాత బకాయిలు రూ.1000 కోట్లలో రూ. 672 కోట్ల నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ నగదును 24 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ నిధులు రైతుల ఖాతాల్లో వేసే బాధ్యతను పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కి ప్రభుత్వం అప్పగించింది. అందుకోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ప్రజా పంపిణీ అవసరాల కోసం పౌరసరఫరాల సంస్థ ద్వారా గత రబీ సీజన్‌లో ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించింది. ఆ క్రమంలో మద్దతు ధరను రైతుల ఖాతాల్లో జమ చేయడంలో జాప్యం జరిగింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ నేపథ్యంలో జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ) నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా రూ.1,000 కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతిస్తూ జులై 4వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు వచ్చిన వెంటనే ధాన్యం బకాయిలను రైతుల ఖాతాల్లో జమ చేసేలా పౌరసరఫరాల సంస్థ అధికారులు చర్యలు చేపట్టనున్నారు. దీంతో ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో ఈ ధాన్యం బకాయిల సొమ్ము జమ కానుందని తెలుస్తుంది. మరోవైపు ఈ రోజు ఉదయం రాజధాని అమరావతిలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది.

మంత్రి నాదెండ్ల ఆదేశం..

ఇదే అంశంపై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల బకాయిలు రూ.672కోట్లు విడుదలకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా దాదాపు 32 వేల మంది రైతులకు ఈ నిధులు మంజూరు ద్వారా లబ్ది చేకూరుతోందన్నారు. 24 గంటల్లో రైతుల ఖాతాల్లో పెండింగ్ బకాయిలు జమ చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు.

## డిప్యూటీ సీఎం పవన్ ను కలిసిన బీజేపీ నూతన అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ !



మంగళగిరి,(సందేశంటైమ్స్, జులై 9) : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఈరోజు (బుధవారం) సాయంత్రం బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు శ్రీ పి.వి.ఎన్. మాధవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని పవన్ కళ్యాణ్ క్యాంప్ కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన పి.వి.ఎన్. మాధవ్, పవన్ కళ్యాణ్‌ను శుభాకాంక్షలు తెలిపారు. ఇక కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలైన జనసేన, బీజేపీల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఈ భేటీ ముఖ్య ఉద్దేశ్యంగా తెలుస్తోంది. ఇరువురు నేతలు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, రాబోయే కార్యక్రమాలపై చర్చించినట్లు సమాచారం.

## రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఉమ్మడి జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్



కోదాడ ,(సందేశంటైమ్స్, జులై 9) : కోదాడ పట్టణంలోని పలు రెస్టారెంట్లు, వివిధ రకముల మసాలా దినుసులు (స్పైసెస్), పచ్చళ్ల షాపులు, కిరాణా, సూపర్ మార్కెట్లలో ఉమ్మడి జిల్లా జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వంకాయలపాటి జ్యోతిర్మయి స్థానిక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని హుజూర్నగర్ రోడ్డుకు ఉన్న లహరి హెూటల్, ధాబాని తనిఖీ చేయగా కిచెన్ అపరిశుభ్రంగా ఉండడం, రిఫ్రిజిరేటర్ లో నిలువ ఉంచిన సుమారు 14,000 రూపాయల విలువ గల చికెన్ ఫ్రై, చికెన్ లెగ్ పీసెస్, చికెన్ గ్రేవీ, చికెన్ పకోడా, క్యాట్ ఫిష్, మటన్ కర్రీ, గుర్తించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కిరాణా, సూపర్ మార్కెట్లలో లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం, కొన్ని కిరాణా షాపులలో ఎలకలు తిరుగుతూ ఎలకల విసర్జితాలు ఆహార పదార్థాలలో కలిసి ఉండటం గుర్తించి, పదార్థాలను గుర్తించి సరైన పెస్ట్ కంట్రోల్ పద్ధతులను పాటించకపోవడంతో యాజమాన్యానికి నోటీసులు జారీచేశారు. ఈ దాడులలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ %దీ%. ప్రభాకర్ తో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## సాయి మందిరంలో మొదలైన గురు పౌర్ణమి ఉత్సవాలు....



కోదాడ,(సందేశంటైమ్స్, జులై 9) : కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం శ్రీ సాయి మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాలు బుధవారం నాడు ప్రారంభమైనాయి అని దేవాలయ చైర్మన్ నలపాటి నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ నలపాటి నరసింహారావు మాట్లాడుతూ మాట్లాడుతూ దేవాలయంలో గణపతి హెూమం, లక్ష్మీ గణపతి హెూమం, షిరిడి సాయి మూలమంత్ర హెూమం తో పాటు ప్రత్యేక పూజలు అర్చకులు సాయి శర్మ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రంగారావు, ఏదులపురం శ్రీనివాసరావు, శరబయ్య, పూర్ణయ్య, సుందర్ రావు, ముంద్రా రమేష్, నలపాటి ఆదినారాయణ, విశ్వేశ్వరరావు, సుధాకర్, రామారావు, ఈదర వెంకటేశ్వరరావు, భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## గురుపౌర్ణమికి ముస్తాబైన సాయిబాబా ఆలయం చైర్మన్ నల్లపాటి నర్సింహారావు



కోదాడ ,(సందేశంటైమ్స్, జులై 9) : కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామ పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డులోని సాయిబాబా ఆలయం గురుపౌర్ణమికి ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం నుంచి విశేష పూజలు, అర్చనలు జరుగుతాయని చైర్మన్ నల్లపాటి నర్సింహారావు తెలిపారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు విజయవంతం చేయాలని కోరారు.

# సాఫ్ట్‌గా.. సర్కారుకే టోకరా

## భవన నిర్మాణ అనుమతుల వ్యవస్థ కూడా పక్కదారి
## వెలుగులోకి 'సాఫ్టెక్' సిబ్బంది మోసాలు
## లైసెన్స్‌డ్ సర్వేయర్లతో కుమ్మక్కు
## ప్రభుత్వాదాయానికి పలు రకాలుగా గండి

జూలై 9(సందేశం టైమ్స్): భవన నిర్మాణ అనుమతుల జారీని వేగవంతం చేయాలి.. పట్టణ ప్రణాళికా విభాగంలో వేళ్లూనుకున్న అవినీతిని అంతమొందించాలి.. ఇదీ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం! అయితే, ప్లాన్ల అనుమతుల విషయంలో నేరుగా పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల పాత్రను తప్పించి లైసెన్స్‌డ్ సర్వేయర్ల దశలోనే ప్రాథమికంగా అనుమతులిచ్చేలా సరికొత్త ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకు వచ్చినా.. అక్రమాలు ఆగటం లేదు. ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన నూతన విధానాన్ని కూడా భ్రష్టు పట్టించేస్తున్నారు. అంతకుముందు అధికారులు అవినీతికి పాల్పడితే.. 'కొందరు లైసెన్స్‌డ్ సర్వేయర్లే'.. 'సాఫ్టెక్స్' సాంకేతిక సిబ్బందితో కలిసి అవినీతికి తెరతీస్తున్నారు!

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధి ఉన్నతాధికారుల దృష్టికి ఇటీవల కాలంలో భవన నిర్మాణాల విషయంలో పలు సంఘటనలు ఫిర్యాదులుగా వస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ విభాగాల అధికారుల లాగిన్ ఐడీలకు కనెక్ట్ అవుతూ ప్రైవేటుగా అప్లికేషన్లను యాక్సెస్ చేస్తున్న విషయం సీఆర్‌డీఏ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. సీఆర్‌డీఏనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఈ నయా దందా జరుగుతోందని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాన్ కోసం దరఖాస్తు చేస్తే ఒక పట్టాన ఆయా పట్టణాభివృద్ధి సంస్థలకు రావటం లేదు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు అప్‌లోడ్ చేసిన ఫైల్, టౌన్‌ప్లానింగ్ అధికారులకు రావాలంటే మధ్యలో సంధానకర్తగా సాఫ్ట్‌వేర్ ఉంటుంది. ఈ సాఫ్ట్‌వేర్ నిర్వహణను సాఫ్టెక్ అనే సంస్థ నిర్వహిస్తోంది. ఈ సంస్థకు చెందిన సాంకేతిక సిబ్బంది.. నూతన విధానంలో అవినీతికి తెరతీస్తున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. నూతన భవన నిర్మాణాలకు నిబంధనల ప్రకారం ప్లాన్లకు దరఖాస్తు చేసుకునే వారి విషయంలో సమస్యలు రావటం లేదు కానీ, నిబంధనల



ఉల్లంఘనకు అవకాశం ఉన్న దరఖాస్తుల విషయంలో మాత్రం సాఫ్టెక్‌కు చెందిన కొందరు సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది. ఉదాహరణకు నూతన నిబంధనల ప్రకారం 30 అడుగుల రోడ్డు తప్పనిసరి. ప్లాన్ కోసం దరఖాస్తు చేసుకోగానే లైసెన్స్‌డ్ సర్వేయర్ స్థాయిలో ముందుగా అనుమతి వచ్చేస్తుంది. దరఖాస్తుదారుడు ఇల్లు కట్టుకుందామనుకుంటే 30 అడుగులు రోడ్డు లేకపోతే దానికి అనుగుణంగా తన సొంత స్థలాన్ని స్థానిక పంచాయతీకి దాన పత్రంగా ఇవ్వాల్సి ఉంటుంది. అది ఇచ్చేముందు సీఆర్‌డీఏ టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి కానీ ఇతర పట్టణాభివృద్ధి సంస్థలు కానీ ఎండార్స్‌మెంట్ జారీ చేస్తాయి. ఈ ఎండార్స్‌మెంట్ల కోసం సీఆర్‌డీఏ, పట్టణాభివృద్ధి సంస్థల కార్యాలయాలకు వెళితేఅసలు మీ ప్లాన్ దరఖాస్తులే రాలేదన్న సమాధానాలు రావటంతో దరఖాస్తుదారులు విస్తుపోతున్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ దగ్గర అప్లికేషన్‌ను చెక్ చేసుకోమని చెబుతున్నారు. దీంతో సర్వేయర్ దగ్గరకు వెళ్లి మరో అప్లికేషన్ పెట్టించటం పరిపాటిగా మారుతోంది. కొంతమంది ఇంజనీర్లు, సాఫ్టెక్ సాంకేతిక ఉద్యోగులు కొందరు కలిసి ఈ పనులు చేయిస్తున్నారని తెలుస్తోంది.

---

# సీతంపేటలో సమ్మె మద్దతుగా మానవహారం



సీతంపేట: జూలై 9(సందేశం టైమ్స్) : దేశవ్యాప్తంగా పిలుపుమేరకు సీతంపేట మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో అసంఘటి కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద 30 నిమిషాలు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినము కల్పించి 500 గిట్టుబాటు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ నాయకులు ఎం తిరుపతిరావు, ఏ భాస్కరరావు, సురేష్, ఎం కాంతారావు, దర్శమి, అంజలి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరిలో కార్మికులు భారీ ర్యాలీ

మంగళగిరి జూలై 9(సందేశం టైమ్స్) : దేశవ్యాప్తంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మె సందర్భంగా మంగళగిరిలో సిఐటియు, ఏఐటియుసి, ఏ ఐ ఎఫ్ టి యు న్యూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. గౌతమ్ బుద్ధ రోడ్డు, కొత్త బస్టాండింగ్, అంబేద్కర్ సెంటర్, దేవస్థానం రోడ్డు మీదగా మెయిన్ బజార్, షాదు సోడా సెంటర్, మిద్దె సెంటర్ మీదగా ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు, సిఐటియు నాయకులు వివి జవహర్లాల్, జేవి రాఘవులు, ఏఐటియుసి నాయకులు ఏ ప్రభాకర్, చిన్ని



తిరుపతయ్య, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలు మరి బాలకృష్ణ, ఏ ఐ ఎఫ్ టి యు నాయకులు కే కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ర్యాలీలో అన్ని వర్గాల కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# వీరవాసరంలో కొనసాగుతున్న సమ్మె

వీరవాసరం జూలై 9(సందేశం టైమ్స్) : లేబర్ కోడ్ రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వీరవాసరంలో కొనసాగుతుంది. ఈ సమ్మెలో ఏపీడబ్ల్యూజేఎఫ్, సిఐటియు ఆధ్వర్యంలో ప్రజాసంఘాలు, అంగన్వాడి వర్కర్స్, ఆశ, రైస్ మిల్లర్స్ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలు పాల్గొన్నాయి.




# బందరులో మున్సిపల్ కార్మికుల సమ్మె




మచిలీపట్నం అర్బన్:జూలై 9(సందేశం టైమ్స్) : కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం మచిలీపట్నంలో మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. సి ఐ టి యు, ఏ ఐ టి యు సి నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని వర్గాల కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కే వి పి ఎస్ నాయకులు చీకటి రాజేష్ మాట్లాడుతూ పని గంటలు పెంచడం దారుణమన్నారు. ఎ ఐ టి యు సి నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మిక సంఘాల ఐక్య పోరాటాల ద్వారా ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహిళా నాయకురాలు చుక్కాకుల బుల్లెమ్మ సిఐటియు మండల కార్యదర్శి చిరువోలు జయరావు, మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---

# సాగర్‌ను సందర్శించిన 24 దేశాల ప్రతినిధులు



విజయపురిసౌత్‌జూలై 9(సందేశం టైమ్స్) : భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ శిక్షణ,పరిశోధన సంస్థలో ఈ నెల 1వ తేదీ నుండి 14వ తేదీ వరకు శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 37 మంది ప్రతినిధుల బృందం నాగార్జునసాగర్‌ను సందర్శించింది. ప్రధాన డ్యామ్, జలాశయం, జల విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను వీరు సందర్శించారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణ చరిత్ర గురించి ఇరిగేషన్ అధికారులు వారికి వివరించారు. సాగర్ పర్యటన ఎంతో ఆసక్తిని రేకెత్తించిందని బృందం చెప్పింది. వారి వెంట ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక పోలీసులు, ఎస్పీఫ్ సిబ్బంది ఉన్నారు.

# మెడికవర్‌లో సిఆర్‌టి-డి ఇంప్లాంటేషన్ సేవలు



జూలై 9(సందేశం టైమ్స్) : కాకినాడ హృద్రోగులకు ప్రపంచ స్థాయి చికిత్సను అందించాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక కార్డియాక్ రీసిం క్రొనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్(సిఆర్‌టి-డి) ఇంప్లాంటేషన్ సేవలు అందుబాటులోకి వచ్చా యని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. మెడికవర్ హస్పటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మాత శ్రీనివాస్ మాట్లాడారు. గుండె వైఫల్యంతో బాధపడుతున్న, గుండె లయ సమస్యలు ఉన్న రోగులకు ఈ అధునాతన చికిత్స గొప్ప ఆశాదీపంగా నిలుస్తుం దన్నారు. సిఆర్‌టి-డి అనేది ఒక ప్రత్యేకమైన పరికరమని అన్నారు. ఇది గుండె యొక్క గదుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి, గుండె యొక్క పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడుతుందన్నారు. గుండె వైఫల్యం యొక్క లక్షణాలను తగ్గిస్తుందన్నారు. జీవన నాణ్యతను మెరుగుపరచటమే కాకుండా ఆకస్మిక గుండె ఆగిపోయే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రణవ్ మాట్లాడుతూ కాకినాడ ప్రజలకు అత్యాధునిక కార్డియాక్ కేర్‌ను అందించడంలో తాము ముందంజలో ఉన్నామన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ కూరాకుల నరేష్ మాట్లాడుతూ సిఆర్‌టి-డి వ్యాధిగ్రస్తులైన వారి హృదయాల సామర్థ్యాన్ని పెంచటవే కాకుండా రక్త ప్రవాహాన్ని పెంచుతాయన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభకరరావు మాట్లా డుతూ సిఆర్‌టి-డి ఇంప్లాంటేషన్ సేవలను ఇప్పటికే ఇద్దరికి అందించినట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, కార్డియాక్ సర్జన్ల బృందం ఉందని, తమ వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.

# చెత్తకుప్పలో మందులపై వైద్యాధికారుల ఆగ్రహం

## కాలిన మందులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత

## డిప్యూటీ డీఎంహెచ్‌వో విచారణఫ ఆరుగురికి మెమోలు జారీ



ప్రొద్దుటూరు, జూలై 9(సందేశం టైమ్స్) : ప్రొద్దుటూరు మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయ ఆవరణలో చెత్తతోపాటు తగులబడిన ప్రభుత్వ మందుల వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గర్భిణులలో రక్తహీనత నివారణకు ఉపయోగించే ఐరన్, కాల్షియం మందులు, సిరఫ్‌లు కొత్తపల్లె పంచాయతీ ఆవరణలో చెత్తకుప్పలో తగులబడుతూ బయటపడ్డ వ్యవహారం పాఠకులకు తెలిసిందే. ఈ సంఘటనపై జిల్లా వైద్యాధికారి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ కేంద్రాల్లో పనిచేసే ఆశా కార్యకర్తలకు హెచ్చరికలు జారీ చేశారు. సిబ్బంది విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని పేర్కొన్నారు. ఈ ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుమన్, కొత్తపల్లె విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి విచారణ చేపట్టారు. చెత్తకుప్పలో కాలిన మందులను విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని ఔషధాల స్టాకును పరిశీలించారు. ఆశా కార్యకర్తలు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాల ధాటికి మందులు తడవడంతో ఏమి చేయాలో దిక్కుతోచక పడవేసినట్లు అధికారుల విచారణలో తేలినట్లు సమాచారం. దీంతో అక్కడి మందులను కల్లూరు పీహెచ్‌సీకి తరలించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఒక ఏఎన్ఎంతోపాటు అయిదుగురు ఆశా కార్యకర్తలకు మెమోలను జారీ చేశారు. సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. సమస్యాత్మక, కాలం చెల్లినమందులను అధికారులకు తెలియజేసి పీహెచ్‌సీలకు తరలించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే వేటు తప్పదని హెచ్చరికలు జారీ చేశారు.

# రైతులు పండ్లతోటలు సాగు చేయాలి



ఖాజీపేట, జూలై 9(సందేశం టైమ్స్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇస్తు న్నందున ఆసక్తిగల రైతులు పండ్లతోటలు సాగు చేసుకోవాలని మైదుకూరు శాసనసభ్యుడు పుట్టాసుధాకర్‌యాదవ్ సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మండల పరిధికి 70 ఎకరాల్లో పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని, అయితే 21 ఎకరాల్లో మాత్రమే సాగు చేస్తున్నారన్నారు. అనంతరం పండ్ల తోటల పెంపకంలో పాల్గొన్న కూలీలతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామంలో పశువుల కోసం నిర్మిస్తున్న నీటి తొట్లను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. పత్తూరు పంచాయతీలోని నాగపట్నంలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన నీటి తొట్టిని ప్రారంభించారు. కాగా కూనవారిపల్లె, నాగపట్నం గ్రామ ప్రజలు కడప-కర్నూలు జాతీయ రహదారిలో ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని ఎమ్మెల్యేకు చూపించి రోజు ఏదో ఒక సంఘటన జరుగుతూ ప్రాణాలు కోల్పోతున్నామని పరిష్కారం చూపాలని విన్నవించుకున్నారు. ఎంపీడీవోను ఆ సమస్యను పరిష్కరించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, నంద్యాల సుబ్బయ్య, ప్రతాప్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, హరినాథరెడ్డి, పుల్లయ్యనాయుడు,గంగినాయుడు, మురళి, క్రిష్ణారెడ్డి, రామసుబ్బయ్య, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

# హత్యకేసులో నిందితుడి అరెస్టు



కొత్తూరు,జూలై 9(సందేశం టైమ్స్) : వసపలో జరిగిన హత్యకేసులో నిందితుడు మనగాన శంకరావును అరెస్టు చేసినట్టు కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్ తెలి పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హత్యకు గురైన లుకలాపు మిన్నారా వు(19) శనివారం రాత్రి మద్యం తాగి టిఫిన్ షాప్‌కి వెళ్లి శంకరరావుతో గొడవప డ్డాడు. వీరిద్దరి మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో శంకరావు సుత్తితో మిన్నారావు తలపై కొట్టడంతో పడిపోయాడు. కొనఊపిరితో ఉన్న మిన్నారావు బతి కితే తనకు ముప్పు తప్పదన్న భయంతో అతడి గొంతుకోసి అతికిరాతంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని రహదారికి అవతలి వైపునకు తీసుకెళ్లి పడేశా డు. హత్యకు ఉపయోగించిన సుత్తి, కత్తిని స్వాధినం చేసుకున్నామని, నిందితు డ్ని కొత్తూరు కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. సీఐతో పాటు ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ, ఏఎస్ఐ రాజేశ్వరావు, హెచ్‌సీ కోటి ఉన్నారు.

# పీ-4పై చౌకబారు విమర్శలు మానుకోండి



విజయనగరం రూరల్,జూలై 9(సందేశం టైమ్స్) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్నిచంద్రబాబు ఏర్పాటు చేసి, దానిపై ప్రత్యేక దృష్టి సారించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున తెలిపారు. అటువంటి కార్యక్రమం గురించి ఎమ్మెల్సీ బొత్స, చిన్న శ్రీనులు కనీసం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఇటువంటి చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవుపలికారు. విజయనగరం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జడ్పీ చైర్మన్ జిల్లాలో అవినీతి సామ్రాట్‌లన్న విషయం ఎవరిని అడిగిగా చెబుతారన్నారు. 2019-24 కాలంలో కోట్లాది రూపాయలు వీరు దోచుకున్నారన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురించి వీరిద్దరూ మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఆయన విజన్ ఉన్న నాయ కుడన్నారు. తొలిసారి ఎమ్మెల్యే, మంత్రిగా ఆయన గజపతినగరం నియోజకవర్గం, జిల్లాను ముందుకు నడిపించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అటువంటి ఆయనపై ఎమ్మెల్సీ బొత్స, జడ్పీ చైర్మన్ చిన్న శ్రీను విమర్శించడం తగదన్నారు. ఏడాది పాలనలో సూపర్‌సిక్స్‌లో ఇప్పటికే కొన్ని హామీలు అమలయ్యాయని, వచ్చేనెలఖరులోగా సూపర్‌సిక్స్‌లో మరికొన్ని హా మీలు అమలు కానున్నాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాదరావు,పాణిఫాణీరాజు, బంగారుబాబు పాల్గొన్నారు.

# ఆనందంగా స్కూలుకు బయలుదేరారు..

## ఇంతలోనే ఊహించని ఘటన

కృష్ణా: జూలై 9(సందేశం టైమ్స్) : రోజులాగానే ఆనందంగా విద్యార్థులు స్కూల్‌కు బయలుదేరారు. కానీ అంతలోనే ఊహించని ఘటనతో విద్యార్థులు షాక్‌కి గురయ్యారు. వారు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఓ లారీ మృత్యువు రూపంలో కబలించింది. ఈ ప్రమాదం కృష్ణా జిల్లాలోని పామర్రు మండలంలో జరిగింది. స్కూల్‌కు వెళ్తుండగా లారీ ఢీకొని పదోతరగతి విద్యార్థి కలపాల జోయల్ (15) మృతిచెందాడు. మృతుడి సోదరుడు అభి, తండ్రికి గాయాలవడంతో.. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు.వివరాల్లోకి వెళ్తే.. జోయల్ తండ్రి జేమ్స్ తన ఇద్దరు పిల్లలను పామర్రులోని పాఠశాలకు పంపించడానికి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో మండలంలోని కురుమద్దాలి వద్ద లారీని డ్రైవర్ రివర్స్ చేస్తుండగా వెనుక వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. లారీ ఢీకొనడంతో ఘటనా స్థలంలోనే జోయల్ మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనతో బల్లిపర్రు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# 10 కిలోల గంజాయితో ఇద్దరు

## ఒడిశా వాసులు అరెస్టు



నరసన్నపేట, జూలై 9(సందేశం టైమ్స్) : ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా రంబ ప్రాంతం నుంచి ఆ రాష్ట్రానికి చెందిన చెందిన ఇద్దరు వ్యక్తులు 10 కిలోల గంజాయిని బెంగుళూరు తరలిస్తుండగా పట్టుబడినట్టు సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. మడపాం టోల్‌ప్లాజా వద్ద ఎస్ఐ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ప్రైవేట్ ట్రావెల్స్ తనిఖీ చేస్తుండగా.. వేరొక వాహనంలో వచ్చిన బసంత మహాపాత్రో, సిద్దాంత స్వాన్ పోలీసులను చూసి పోరిపోయేం దుకు ప్రయత్నించారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిద్దరి పట్టుకుని బ్యాగ్ లు తనిఖీ చేశారు. అందులో 10కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు ఇరిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ స్పష్టం చేశారు.

# జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలి




హైదరాబాద్, జూలై 9(సందేశం టైమ్స్) : అర్బన్ జిల్లాగా ఉన్న హైదరాబాద్ మినహా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలయింది. ప్రస్తుతం ఉన్న తొమ్మిది నవోదయ పాఠశాలలకు అదనంగా మరో 23 పాఠశాలలు ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ బీఆర్ఎస్ మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్ ఈ పిల్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది జె. రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ కొత్తగా ఏర్పడిన 23 జిల్లాల్లో నవోదయ పాఠశాలలు ఏర్పాటు చేయకపోవడం రాజ్యాంగవిరుద్ధమని పేర్కొన్నారు. కేంద్రం కొత్తగా ఏడు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినా అడ్మిషన్ల నోటిఫికేషన్‌లో వీటిని చేర్చలేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరాలు తెలియజేయాలని కోరుతూ కేంద్ర విద్యాశాఖ, నవోదయ విద్యాలయ సమితిలకు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను రెండువారాలకు వాయిదా వేసింది.

# ఈతకు వెళ్లి ముగురు యువకుల గల్లంతు




కామారెడ్డి జిల్లా:జూలై 9(సందేశం టైమ్స్): నిజాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్‌వాటంలో ఈతకు వెళ్లి ముగ్గురు యువకులు గల్లంతు అయ్యారు. ఎల్లారెడ్డి మండలం, సోమార్ పేట్‌లో క్రికెట్ ఆడటానికి ఎల్లారెడ్డికి చెందిన యువకులు వెళ్లారు. క్రికెట్ ఆడిన తర్వాత నిజాంసాగర్ నీటిలో స్నానం చేయడానికి స్నేహితులు వెళ్లారు. బ్యాక్‌వాటర్‌లో మునిగి ముగ్గురు యువకులు (మధుకర్ గౌడ్, నవీన్, హర్షవర్ధన్) గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు నిజాంసాగర్ వద్దకు చేరుకుని రాత్రి నుంచి గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధుకర్ గౌడ్ మృతదేహం లభ్యం కాగా మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. విషయం తెలుసుకున్న యువకుల కుటుంబీకులు, గ్రామస్తులు నిజాంసాగర్ బ్యాక్ వాటర్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు.అప్పటివరకు స్నేహితులతో సరదగా క్రికెట్ ఆడిన ముగ్గురు యువకులు నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో గల్లంతయ్యారు. సోమవారం సాయంత్రం ఈ ఘటన చోటు చేసుకుంది. మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (16), తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన నవీన్ (17), ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మధుకర్‌గౌడ్ (17) నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో స్నానానికి వెళ్లి గల్లంతయ్యారు. కాగా సోమార్‌పేట గ్రామంలో 11 మంది యువకులు క్రికెట్ ఆడారు. మధ్యాహ్నం వేళ ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో స్నానం చేసేందుకు హాసన్ పల్లి గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో దిగారు. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు నీట మునిగి గల్లంతయ్యారు.

# రైతుల కష్టాలు తీరాయి

**- పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**- ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల**



కొల్లాపూర్, జూలై 9(సందేశం టైమ్స్) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే రైతుల కష్టాలు తీరుతున్నాయని పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూప ల్లి కృష్ణారావు అన్నారు. పంటలకు సకాలం లో సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నా రు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మం డల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో రేగు మాన్ గడ్డ వద్ద మంగళవారం ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లో ఒకటవ మోటార్‌ను కంప్యూటర్ ద్వారా ఆన్ చేసి సాగు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రితో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారా యణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రూ. 8 లక్షల కోట్ల అప్పు చేసి కూడా ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ప్రాజె క్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవా లని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు లకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. వారే ఇప్పుడు ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో రైతు లకు అన్ని విధాలా న్యాయం జరుగుతుం దని తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. అంతకుముం దు ఎంజీకే ఎల్ఐ ద్వారా విడుదలైన వరద నీటికి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, చంద్రశేఖర్, మురళి, డీఈ లోకిలాల్, ఏఈ సంతోశ్ తది తరులు పాల్గొన్నారు.

# 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీలు

## 13 నుంచి అందుబాటులోకి..



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ,జూలై 9(సందేశం టైమ్స్): జోన్ పరిధిలోని వివిధ మార్గాల్లో నడుస్తున్న ముఖ్యమైన 8 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు ఏసీ బోగీలను జత చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ప్రతీ రైలుకు ఒక త్రీటైర్ ఏసీ (ఎకానమీ) బోగీని శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య నడిచే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్(17233/17234)రైళ్లు, సికింద్రాబాద్-గుంటూరు మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్(17201/17202), కాచిగూడ-విజయవాడ మధ్య నడిచే శాతవాహన(12713/12714), విజయవాడ- చెన్నై మధ్య నడిచే పినాకిని ఎక్స్‌ప్రెస్(12711/12712)రైళ్లకు అదనపు ఏసీ బోగీ సదుపాయం ఈ నెల 13 నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# మహిళకు షాకిచ్చిన స్నేహితురాలు..

## బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి పర్సు చోరీ

జూలై 9(సందేశం టైమ్స్) :ఉద్యోగం చేసే ఇద్దరు మహిళలు ఒకే ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గదిలో బీరువా లేకపోవడంతో ఓ మహిళ తన నగలను పర్సులో పెట్టి పనిమీద వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేసరికి నగలు పర్సు మాయం కావడంతో ఆమె షాకైపోయింది. తనతో పాటు ఉంటున్న మహిళ, ఆమె బాయ్‌ఫ్రెండ్ కారణమని భావించి చివరకు పోలీసులను ఆశ్రయించింది. నగరంలోని వెంగళరావు నగర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే..శైలజ అనే మహిళ బంజారాహిల్స్‌లోని ఓ హోటల్‌లో పనిచేస్తుంటుంది. ఎల్లారెడ్డిగూడ లోని అద్దె గదిలో ఉంటోంది. శైలజ తోపాటు అదే గదిలో కలిసి ఉంటున్న సౌభాగ్య అనే మరో మహిళ కూడా ఉంటోంది. అద్దె గదిలో బీరువా లేకపోవడంతో శైలజ తన మంగళసూత్రం, చెవి కమ్మలు, గాజులు, చంద్రహారం, నల్లపూసల దండ, కొంత డబ్బును పర్సులో ఉంచి ఉద్యోగానికి ఇటీవల వెళ్ళింది. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సౌభాగ్య తన బాయ్‌ఫ్రెండ్‌ను ఇంటికి పిలిపించుంది. ఆ తరువాత సాయంత్రానికి ఇంటికి వచ్చిన శైలజ తన పర్సు కనిపించకపోవడంతో షాకైపోయింది. సౌభాగ్య, ఆమె బాయ్ ఫ్రెండ్‌లే ఈ చోరీకి పాల్పడి ఉంటారని భావించిన శైలజ చివరకు పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# అమ్మ అనాథగా మారింది..

## కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన కొడుకు



వికారాబాద్:జూలై 9(సందేశం టైమ్స్) : జిల్లాలోని పరిగి మండలం నస్కల్ గ్రామంలో దారుణం జరిగింది. పోషణ భారమైందని ఎనభై ఏళ్ల వయసున్న కన్న తల్లి నత్యమ్మను, పక్షవాతంతో బాధపడుతున్న తమ్ముడు మహిపాల్ రెడ్డిని ఇంట్లో నుంచి గోవర్ధన్ రెడ్డి అనే వ్యక్తి గెంటి వేశాడు. ఎనభై ఏళ్ల వయస్సులో పక్షవాతంతో ఉన్న కొడుకును తీసుకొని ఎటుపోవాలంటూ.... తనకు న్యాయం చేయాలని నత్యమ్మ పోలీసులను ఆశ్రయించింది.కూతుర్లు కూడా తనను చూసుకునేందుకు ఇష్టపడటం లేదని నత్యమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. నత్యమ్మకు సంతానంగా ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కొడుకులు ఉండగా అందరి పెళ్లిళ్లు అయిపోయాయి. చిన్న కొడుకు మహిపాల్ భార్య నాలుగేళ్ల క్రితం చనిపోగా... అతను పక్షవాతంతో బాధపడుతుంటూ పొలం వద్ద గుడిసెలో నివాసం ఉంటున్నాడు. అప్పటి నుంచి నత్యమ్మ మొత్తం ఆస్తి గోవర్ధన్ రెడ్డి ఆధీనంలోనే ఉంది. నత్యమ్మ పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు అతన్ని పిలిచి గట్టిగా అడగటంతో పశ్చాతాప పడ్డ గోవర్ధన్ తల్లిని, తమ్ముణ్ని ఇంటికి తీసుకెళ్లాడు. గతంలో కూడా మూడు సార్లు తల్లిని గెంటేసే ప్రయత్నం చేయగా గ్రామస్థులు అడ్డుకున్నట్లు తెలుస్తోంది.

# వందేభారత్‌కు తృటిలో తప్పిన ప్రమాదం..

మహబూబాబాద్, జూలై 9(సందేశం టైమ్స్) : విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు తృటిలో ప్రమాదం తప్పింది. మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ సమీప అప్ లైన్‌లో 428/11 వద్ద రైల్వే ట్రాక్‌పైకి వచ్చిన ఎద్దును వేగంగా వస్తున్న వందేభారత్ రైలు ఢీకొట్టింది. దీంతో కొన్ని నిమిషాలపాటు ట్రాక్‌పై ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచిపోయింది. ఈ ఘటనపై సమీపంలోని రైల్వే స్టేషన్ అధికారులకు వందేభారత్ సిబ్బంది సమాచారం అందించారు. దీంతో అధికారులతోపాటు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ట్రాక్‌పై ఉన్న ఎద్దును తొలగించారు.అయితే ఈ ఘటనలో రైలు ఇంజన్ ముందు భాగం విరిగిపోయింది. ఆ తర్వాత రైలు సికింద్రాబాద్‌కు బయలుదేరింది. రైల్వే ట్రాక్‌పై వందేభారత్ నిలిచిపోవడంతో.. ఆ ట్రాక్‌పై వెళ్లే రైళ్లను కొద్దిసేపు నిలిపివేశారు. ఈ సమయంలో వందేభారత్‌లోని ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోవైపు ఈ ఎద్దు యజమాని కోసం రైల్వే అధికారులు గాలిస్తున్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు స్టేషన్ అధికారులు చెప్పారు.మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చీరాల ఫైర్ ఆఫీస్ గేటు వద్ద మరో వందే భారత్ రైలు నిలిచిపోయింది. ఆదివారం నాడు ఓ కుక్కని వందే భారత్ రైలు ఢీకొట్టింది. అనంతరం ఎయిర్ బ్రేక్ పట్టేసింది. దీంతో రైలు అక్కడికక్కడే నిలిచిపోయింది.

# సంపాదకీయం

## జాతి నిర్మాణంలో హిందీ బంధం

జీవనోపాధికి కన్న ఊరు, మాతృదేశం విడిచి సుదూర సీమలకు వెళ్లిన తర్వాత తల్లి భాష, స్వీయ జాతీయ సంస్కృతి ప్రాధాన్యం తెలిసివస్తుంది. ప్రపంచంలో 193 దేశాలున్నాయి. ఇంచుమించు ఈ సమస్త దేశాల వారు గల్ఫ్ రాజ్యాలలో, ముఖ్యంగా దుబాయిలో ఉంటున్నారు. ఒక్క భారతీయులు మినహా ఇతర జాతీయులు అందరూ తమ తమ భాషలలో పరస్పరం సంభాషించుకుంటారు. ఇటువంటి అవకాశం భారతీయులకు లేదు.హిందీ లేదా ఆంగ్లం రాని ఒక భారతీయుడు తన భాష తెలియని తోటి స్వదేశస్థుడితో అరబ్బీ భాషలో మాత్రమే మాట్లాడగలుగుతాడు. చివరకు తమ ఫిర్యాదులతో భారతీయ దౌత్య కార్యాలయాలకు వచ్చే దక్షిణ భారత ప్రవాస కార్మికులు అనేక మంది అరబ్బీ భాషలోనే తమ గోడు చెప్పుకోవడం కద్దు. క్రింది స్థాయి దౌత్య సిబ్బంది అరబ్బీ నుంచి హిందీ భాషలోకి అనువదించి అధికారులకు వివరిస్తారు. తెలుగు ప్రవాసులు లేదా ఉత్తరాది వారు ఉదయం వేళ అల్పాహారానికై మలయాళీలు నిర్వహించే హెూటల్‌కు వెళ్ళి అరబ్బీలో ఆర్డరు ఇస్తారు. తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన మహిళ ఒకరు తెలుగు మినహా మరే భాష రాకపోవడంతో సుమారు ఒక సంవత్సరం జైలులో మగ్గిపోవలసివచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అలోక్ తివారీ సౌదీ అరేబియాలోని ఒక విశ్వవిద్యాలయంలో ఆచార్యుడు. ఆయనకు తెలుగు మిత్రులు ఎక్కువ. ఒకసారి ఆయన కుటుంబసమేతంగా తెలంగాణ పర్యటనకు వెళ్లారు. అయితే భాషాపరమైన ఇబ్బందితో అర్థాంతరంగా ఆయన తన పర్యటనను ముగించుకోవలసివచ్చింది. బహుళజాతి సంస్థలలో పనిచేసే నానా దేశాల వారు మధ్యాహ్న భోజన విరామంలో ఆయా జాతీయులు అందరూ కలిసి ఒక్కచోట తమ తమ భాషలలో మాట్లాడుకొంటుండగా, భారతీయులు మాత్రం ప్రాంతాలవారీగా విడిపోతుంటారు. మలయాళీలు ఒక బృందంగా, ఉర్దూ మాట్లాడే హైదరాబాదీలు మరో సమూహంగా విడిపోతుంటారు. హిందీ భాష రాని కారణంగా ఐ.టి నిష్ణాతులైన తెలుగు ఇంజినీర్లు తాము పని చేస్తున్న సంస్థలలో తోటి భారతీయులతో కలివిడిగా ఉండలేకపోతున్నారు. ఇది వారిని సామాజికంగా ఏకాకులను చేస్తోంది.ఈ నేపథ్యంలో హిందీ ప్రాధాన్యాన్ని తెలుసుకోవల్సిన ఆవశ్యకత ఉంది. విశాల భారతావని విభిన్న భాషలు, వైవిధ్యభరిత జీవనరీతులకు నెలవు. జాతీయ భాషా వివాదంలో మొదటి నుంచి హిందీని ఆ భాషేతరులపై బలవంతంగా రుద్దుతున్న ఒక అన్య భాషగా చిత్రీకరిస్తున్నారు. తమ భావజాల వ్యాప్తి కొరకు ఒక దేశం%-%ఒకే విధానంను అనుసరిస్తున్న భారతీయ జనతా పార్టీకి హిందీ మాట్లాడే రాష్ట్రాలలో రాజకీయ అధిపత్యం ఉన్నది. హిందీయేతర రాష్ట్రాలలో ఆ పార్టీ ప్రాబల్యం అంతగా లేదు. నూతన జాతీయ విద్యావిధానం క్రింద హిందీని వ్యూహాత్మకంగా అమలుపరుస్తున్నారనే బలమైన అభిప్రాయం నెలకొంటున్న నేపథ్యంలో మరాఠీ భాషా రాష్ట్రమైన మహారాష్ట్రలో హిందీ అమలు విషయమై ఉత్తర్వు జారీ చేయడం, ఉపసంహరించుకోవడం రెండూ జరిగాయి. ఇప్పటికే తమిళనాడులో డీఎంకే ప్రభుత్వం హిందీ అమలును పూర్తిగా రాజకీయ కోణం నుండి ఎదుర్కొంటూ బీజేపీని ఇరకాటంలో పెడుతోంది. తాము అధికారంలో ఉన్న మహారాష్ట్రలో సైతం హిందీకి వ్యతిరేకత రావడం బీజేపీ ప్రాబల్యానికి విఘాతమని చెప్పవచ్చు. అంత మాత్రాన హిందీ భాష వ్యాప్తికి బీజేపీ తన కృషిని విరమిస్తుందనుకోవడం పొరపాటు. అలాగని హిందీని వ్యతిరేకించడం కూడా పొరపాటే. ఒక సువిశాల దేశంలోని అనేక ప్రాంతాలలో నలుగురికి తెలిసే భాషను నేర్చుకోవడంలో తప్పేమీ లేదు. నేర్చుకోవాలి కూడా. పూర్తిగా అరబ్బీ దేశమైన సౌదీ అరేబియా తమ విద్యార్థులకు చైనీస్ భాషను బోధిస్తోంది. మహమ్మద్ రఫీ మధుర గీతాలను వినే మనం హిందీని తూర్పారపట్టడం ఏమిటి? దీన్ని మానుకోవాలి.ఒక దేశం%-% ఒకే భాష అనేది ఒక విఫల ప్రయోగం. ప్రఖ్యాత ఆంగ్ల రచయిత జార్జి బెర్నార్డ్ షా వ్యాఖ్యానించినట్లుగా అమెరికా, బ్రిటన్ రెండూ ఆంగ్లం మాట్లాడే రాజ్యాలయినా ఒకే జాతికి చెందినవి కావు. అలాగని అరబ్బులు అందరిదీ ఒకే భాష, ఒకే సంస్కృతి అయినా 22 దేశాలుగా విడిపోయి ఉన్నారు. ఉక్రెయిన్%-%రష్యా యుద్ధం మొదలు మహారాష్ట్ర%-%కర్ణాటక సరిహద్దు వివాదం దాకా ఎన్నో ఘర్షణలు భాషతో ముడిపడి ఉన్నాయి. తెలుగు భాష ఒక్కటయినా, యాస అనేది ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర వహించిందనేది మరిచిపోకూడదు. విభిన్న భాషలు, వివిధ సంస్కృతులు మన విశిష్టత. భిన్నత్వంలో ఏకత్వానికి భారతదేశమే యావత్ ప్రపంచానికి మార్గదర్శి. భారతీయులు స్వదేశంలో ఉన్నా, విదేశాలలో ఉన్నా తమ మాతృభాషతో పాటు భారతీయ అనుసంధాన భాషగా హిందీని స్వచ్ఛందంగా నేర్చుకోవడానికి ముందుకు రావాలి. సంకుచిత రాజకీయ కారణాలకు అతీతంగా జాతి నిర్మాణంలో ఈ భాషాబంధం బలపడాలి.


# అందరూ ఒకే ఫార్మాట్‌లో నివేదికలెలా ఇచ్చారు

## కొన్ని నివేదికలపై నోడల్ అధికారుల సంతకాలు లేవు
## వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీ వేస్తాం
## పోలీసుస్టేషన్లలో సీసీకెమెరాల ఏర్పాటుపై నిలదీసిన హైకోర్టు



అమరావతి,జూలై 9(సందేశం టైమ్స్) : స్టేషన్ మొత్తం కనిపించేలా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని సర్టిపై చేస్తూ ఎస్‌డీపీవోలు(డీఎస్పీలు) ఇచ్చిన నివేదికలపై హైకోర్టు ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. ఎస్‌డీపీవోలందరూ ఒకే ఫార్మాట్‌లో నివేదికలు ఎలా సమర్పించారని ప్రశ్నించింది. కొన్ని జిల్లాల నివేదికలపై సంబంధిత జిల్లాల నోడల్ అధికారుల సంతకాలు లేవని, వారి బదులు ఇతర అధికారులు సంతకాలు చేశారని తెలిపింది. ఓ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా విజయవాడ మూడవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నివేదికను ధర్మాసనం ప్రస్తావించింది. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లో ఒక సీసీ కెమెరా మాత్రమే ఉన్నట్లు మేజిస్ట్రేట్ నివేదికలో పేర్కొన్నారని గుర్తుచేసింది. అయితే, స్టేషన్‌ను వ్యక్తిగతంగా తనిఖీ చేసి రాణా మొత్తం కవర్ అయ్యేలా సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్లు విజయవాడ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సర్టిపై చేస్తూ కోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారని తెలిపింది. పరస్పర భిన్న నివేదికల నేపథ్యంలో ఎస్‌డీపీవోలు సమర్పించిన నివేదికల వాస్తవికతను తేల్చేందుకు అడ్వొకేట్ కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పోలీసుస్టేషన్లలో పర్యటించి రాణాలో ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు? స్టేషన్ మొత్తం కనిపించేలా ఏర్పాటు చేశారా?లేదా? తదితర అంశాలపై కమిటీ నుంచి నివేదిక కోరతామని పేర్కొంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఎన్ని స్టేషన్లలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయలేదో వివరాలు తమ ముందు ఉంచాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)ని ఆదేశిస్తూ విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ జగడం సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ఆ మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జూలై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలుకాకపోవడంతో యోగేష్ 2022లో కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు పల్నాడుజిల్లా, మాచవరం పోలీసులు తన సోదరుడు గోపిరాజును అక్రమంగా నిర్బంధించారంటూ కటారు నాగరాజు గతేడాది నవంబరులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు మంగళవారం మరోసారి విచారణకు రాగా న్యాయవాది తాండవ యోగేష్ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా సీసీకెమెరాల ఏర్పాటు జరగలేదన్నారు. రాష్ట్రంలో 1392 పోలీసుస్టేషన్లు ఉండగా, 1001 పోలీసుస్టేషన్లలో మాత్రమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ... సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా లాకప్‌లు ఉన్న అన్ని స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు.0

# ఏనుగుల మంద స్వైరవిహారం



రామకుప్పం, జూలై 9(సందేశం టైమ్స్): రామకుప్పం మండలంలోని 89పెద్దూరు గ్రామ సమీప తోటలపై రాత్రి ఆరు ఏనుగుల మంద స్వైరవిహారం చేసింది. తమిళనాడు అడవుల నుంచి వి.కోట మండలం నాయకనేరి అడవుల మీదుగా వచ్చిన ఏనుగులు 89పెద్దూరు గ్రామానికి చెందిన పలువురి అరటి, టమోటా, మామిడి తోటలపై దాడులు చేసి.. విధ్వంసం సృష్టించాయి. ఓ రైతుకు చెందిన 30 అరటిచెట్లను ధ్వంసం చేశాయి. మరో రైతు టమోటా తోటను కొంతమేర ధ్వంసం చేశాయి. సమీప మామిడి తోటల్లో సంచరిస్తూ మామిడికాయలు, పండ్లను తిన్నంతగా తిని.. నేలరాల్చాయి. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు, ట్రాకర్లతో కలిసి పెద్దూరు అటవీ ప్రాంతానికి చేరుకుని డప్పులు వాయిస్తూ, టపాకాయలు పేల్చుతూ ఏనుగుల మందను అడవిలోకి తరిమేశారు. ఇప్పటికే 15 రోజులుగా ననియాల గ్రామ పరిసర పొలాలు, తోటలపై ఒంటరి ఏనుగు దాడి చేస్తున్న విషయం తెలిసిందే. ఇపుడీ ఏనుగుల మంద కూడా తోడవడంతో అటవీ సమీప గ్రామాల రైతులు, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఏనుగులను పొలాలు, గ్రామాల వైపు రాకుండా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పీ-4కు సర్వం సిద్ధం



(కాకినాడ), జూలై 9(సందేశం టైమ్స్) : పేదరికంలో ఉన్న కుటుంబాలను ఆర్థికంగా పైకి తేవడానికి పేదవాడిని పైకి తెద్దాం ప్రణాళిక ద్వారా పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు, విద్య, వైద్యం అందించేందుకు లక్ష్యంగా పెట్టుకుని సీఎం చంద్రబాబు పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించి దాతల సహకారంతోపాటు ప్రభుత్వం వైపు నుంచి కూడా అన్ని విధాలుగా ఊతమిచ్చి పీ-4ను అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా జిల్లాలో పీ-4కు అర్హత కలిగిన బంగారు కుటుంబాల జాబితాను ఇప్పటికే సిద్ధం చేశారు. మార్గదర్శకుల జాబితా కూడా దాదాపు సిద్ధమైంది. పీ-4 అమలు పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారుల నియామకం కూడా జరిగింది. పీ-4 అమలు తీరు తెన్నులకు సంబంధించి తాజాగా అన్ని విభాగాల అధికారులతో సమావేశమైన కలెక్టర్ షాన్‌మోహన్ ఆగస్టు నెల నుంచి అమలు చేసేలా కసరత్తు చేస్తున్నారు. పేదరికం లేని సమాజ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం సదాశయంతో చేపట్టిన పీ4 కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ ఉద్యోగులు మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలను దత్తత స్వీకరించి ఆదర్శంగా నిలవనున్నారు.ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలతోపాటు ప్రజలను భాగస్వాములను చేసి ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి, మౌలిక ఆశయంతో ప్రభుత్వ ఆశయాన్ని, లక్ష్యాన్ని సాకారం చేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు ముందుకు వచ్చి మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలిచారు. ఇందుకనుగుణంగా జిల్లాలోని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ప్రభుత్వ అధికారులు, సిబ్బంది మార్గదర్శకులుగా బంగారు కుటుంబాలకు అండగా నిలవనున్నారు. గ్రామస్థాయి ఉద్యోగి ఒక కుటుంబాన్ని, మండల స్థాయి ఉద్యోగి రెండు, డివిజన్, జిల్లాస్థాయిలో సెంకడ్ ఇన్ ర్యాంకు ఉద్యోగులు మూడు కుటుంబాలను, జిల్లా అధికారులు ఐదు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ సూచనల మేరకు ప్రణాళికాబద్ధంగా అంతా సిద్ధం చేశారు. బంగారు కుటుంబాల జీవన స్థాయి పెంచేందుకు 15అంశాలతో కూడిన జాబితా రూపొందించారు. ఉద్యోగులు ఎంచుకున్న బంగారు కుటుంబాలను మార్గదర్శులు కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషిచేయనున్నారు




# క్రీడావార్తలు




## నెట్స్‌లో బుమ్రా జోరుగా

లండన్: సిరీస్ సమం చేసిన జోష్‌లో ఉన్న భారత్.. గురువారం నుంచి లార్డ్స్‌లో జరిగే మూడో టెస్ట్ కోసం సిద్ధమవుతోంది. పనిభారం కారణంగా గత మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకొన్న పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం నెట్స్‌లో బుమ్రా తీవ్రంగా శ్రమించాడు. ఆ తర్వాత లెఫ్టామ్ స్పినర్లు, త్రోడౌన్ స్పెషలిస్టలతో బ్యాటింగ్ కూడా ప్రాక్టీస్ చేశాడు. కెప్టెన్ గిల్, రాహుల్, జైస్వాల్, పంత్, ఆకాశ్‌దీప, సిరాజ్ నెట్స్‌కు దూరంగా ఉన్నారు.

## ఆడలేక మద్దెల దరువు..
## పరువు తీసుకుంటున్న ఇంగ్లండ్!




టీమిండియాను చూసి భయపడుతోంది ఇంగ్లండ్. లీడ్స్ టెస్ట్‌లో బ్యాటింగ్ బలంతో బయటపడిన ఆతిథ్య జట్టు.. ఎడ్జ్‌బాస్టన్‌లో మాత్రం గిల్ సేన ముందు సరెండర్ అయింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా అన్ని విభాగాల్లో తిరుగులేని ఆధిపత్యం చూపించిన మెన్ ఇన్ బ్లూ.. ఏకంగా 336 పరుగుల భారీ తేడాతో స్టోక్స్ సేనను చిత్తు చేసింది. సొంతగడ్డపై ఊహించని పరాభవంతో ఇంగ్లండ్‌కు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఆ టీమ్ కెప్టెన్ స్టోక్స్ ఓటమి నెపాన్ని పిచ్ క్యూరేటర్‌పై నెట్టేస్తున్నాడు. ఇది ఉపఖండంలో మాదిరిగా ఫ్లాట్ పిచ్‌లా మారిందని చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అయితే అతడికి భారత కోచ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చాడు.స్టోక్స్ చెప్పినట్లు ఎడ్జ్‌బాస్టన్ వికెట్ పూర్తి బ్యాటింగ్ ట్రాక్‌గా మారిందని అనుకుంటే.. భాతర బ్యాటర్లు అదరగొట్టిన చోట, ఇంగ్లండ్ ఎందుకు ఫెయిలైందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే సమయంలో ఫ్లాట్ వికెట్‌పై భారత బౌలర్ల రేంజ్‌లో ఆతిథ్య జట్టు ఎందుకు బౌలింగ్ చేయలేకపోయిందనే క్వశ్చన్స్ కూడా వస్తున్నాయి. ఆడలేక మద్దెల దరువు అంటే ఇదేనని.. ఓటమి ఒప్పుకొనే ధైర్యం లేకే స్టోక్స్ ఇలా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. దీనిపై భారత బ్యాటింగ్ కోచ్ సితాంషు కోటక్ ఘాటుగా స్పందించాడు. ఇది ఉపఖండ పిచ్‌లా అనిపించలేదని, టీమిండియా బౌలర్లకు పిచ్ నుంచి బాగా మద్దతు లభించిందన్నాడు కోటక్.

## గ్రామీణ క్రికెట్ గోడు పట్టదా




హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) పేరుకి తగ్గట్టే రాజధాని ప్రాంత క్రికెట్ అభివృద్ధి సంఘంలా తయారైంది. 1934లో హెచ్‌సీఏ ఆవిర్భవించినప్పటినుంచి ఇప్పటివరకు జిల్లాల్లో ఒక్క టర్ఫ్ వికెట్ ఉన్న స్టేడియం కూడా నిర్మించలేదు. 65 శాతం జనాభా గల జిల్లాల నుంచి క్రికెటర్లు ఆడేందుకు తొమ్మిదే జట్లుంటే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 35 శాతం క్రికెటర్లు పోటీ పడేందుకు ఏకంగా 205 జట్లున్నాయి. గ్రామీణ క్రికెట్‌పై అనాదిగా హెచ్‌సీఏ శీతకన్ను వేసిందనేందుకు ఇదే నిదర్శనం. ప్రస్తుత కార్యవర్గం చేతిలోకి హెచ్‌సీఏ పగ్గాలు వచ్చాక గుడ్డిలో మెల్ల అనేలా మహబూబ్‌నగర్ జిల్లాలో టర్ఫ్ వికెట్ నిర్మించేందుకు సుమారు రూ.60 లక్షల నిధులను గత ఏడాది మంజూరు చేసింది. ఇది మినహా మిగిలిన ఎనిమిది జిల్లాల్లో హెచ్‌సీఏ స్టేడియం ఒక్కటీ లేదు. రాష్ట్రంలో ధనిక క్రీడా సంఘంగా చెప్పుకునే హెచ్‌సీఏకి హైదరాబాద్‌లో కూడా ఉప్పల్, సికింద్రాబాద్ జింఖానా స్టేడియాలు మినహా ఒక్క సొంత మైదానం కూడా లేదు. కారణం ఈ సంఘంలోని మూడు గ్రూపులకు చెందిన వారే హైదరాబాద్ శివార్లలో క్రికెట్ మైదానాలు నిర్మించి వాటిని హెచ్‌సీఏకి అద్దెకుఇస్తుంటారు. హెచ్‌సీఏ సొంత స్టేడియాలు నిర్మిస్తే తమ ఆదాయానికి గండి పడుతుందన్నది వీళ్ల భయం.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే 205 క్లబ్‌లతో హెచ్‌సీఏ డివిజన్ లీగ్‌లు నిర్వహిస్తారు. ఈ లీగ్స్‌లో హైదరాబాద్ పరిసర క్రికెటర్లందరూ ఏడాది పొడవునా ఆడేందుకు ఒక టోర్నమెంట్ వ్యవస్థ ఉంది. దేశవాళీ టోర్నీలకు క్రికెటర్లను ఎంపిక చేయాలంటే ఈ లీగ్స్‌లో ప్రదర్శనే ప్రామాణికం. జిల్లాల్లో ఈ క్లబ్‌లు, లీగ్ వ్యవస్థ లేకపోవడంతో గ్రామీణ క్రికెటర్లకు అన్యాయం జరుగుతోంది. జిల్లాల జట్లు, క్లబ్‌ల సంఖ్య పెరిగితే హైదరాబాద్ పరిధిలోని క్లబ్‌లలో అనధికారికంగా డబ్బులిచ్చి ఆడేందుకు వచ్చేవారు ఆగిపోతారనే భయంతో హెచ్‌సీఏలోని కొందరు దళారులు కొత్త జిల్లాలు, క్లబ్‌లకు సభ్యత్వం ఇవ్వకుండా మోకాలడ్డుతున్నారు.

## ఇంగ్లాండ్‌కు టీమిండియా ఫీవర్..
## మొత్తం కథ మారిపోయిందిగా!




భారత్‌తో 5 టెస్టుల సిరీస్ మొదలవక ముందు ఇంగ్లండ్ చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించింది. కెప్టెన్ బెన్ స్టోక్స్ గాయం నుంచి కోలుకొని ఫుల్ ఫిట్‌గా కనిపించాడు. జింబాబ్వేతో జరిగిన ఏకైక టెస్టులో ఆ టీమ్ భారీ విజయం సాధించింది. బౌలింగ్ యూనిట్‌లో లోటుపాట్లు ఉన్నా బ్యాటింగ్ బలం, సొంతగడ్డపై అనుకూల పరిస్థితులు, అలవాటు పడిన పిచ్‌లు, బజ్‌బాల్ ఫార్ములా వెరసి టీమిండియాతో సిరీస్‌లో దుమ్మురేపుతామని భావించింది ఇంగ్లీష్ టీమ్. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజాలు లేని భారత కుర్ర జట్టును ఓ ఆటాడుకోవాలని అనుకుంది. కానీ కట్ చేస్తే.. 2 వారాల్లో సీన్ రివర్స్ అయింది. గిల్ సేన మొత్తం కథను మార్చేసింది.భారత్‌ను భయపెడదామని అనుకున్న ఇంగ్లండ్.. ఇప్పుడు టీమిండియాను చూసి వణుకుతోంది. మొదటి టెస్టులో బ్యాటింగ్ బలంతో గెలిచిన స్టోక్స్ సేన.. ఎడ్జ్‌బాస్టన్‌లో 336 పరుగుల తేడాతో చిత్తుగా ఓడింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్.. ఇలా ఏ విభాగంలో చూసుకున్నా యంగ్ ఇండియా జోరు ముందు ఆతిథ్య జట్టు నిలబడలేకపోయింది. ముఖ్యంగా సారథి గిల్ నేతృత్వంలోని బ్యాటింగ్ ఆర్డర్‌ను చూసి ఇంగ్లండ్ తెగ భయపడుతోంది. గిల్, జైస్వాల్, పంత్, రాహుల్.. ఇలా ఒకరికి పోటీగా ఒకరు పరుగుల వర్షం కురిపిస్తూ ఉండటంతో దెబ్బకు పిచ్‌ను మార్చేసింది. 3వ టెస్ట్‌కు ఆతిథ్యం ఇస్తున్న లార్డ్స్‌లో ఎలాగైనా నెగ్గాలనే తాపత్రయంలో ఫుల్ గ్రీన్ వికెట్‌ను రెడీ చేయిస్తోంది ఇంగ్లండ్.బజ్‌బాల్‌తో భారత్‌ను కుమ్మేద్దామని భావించిన ఇంగ్లండ్.. లీడ్స్, ఎడ్జ్‌బాస్టన్‌లో బ్యాటింగ్‌కు సహకరించే వికెట్లు తయారు చేయించింది. కానీ అక్కడ ఆతిథ్య జట్టు బ్యాటర్ల కంటే టీమిండియా బ్యాటర్లు మరింత చెలరేగి ఆడారు. దీంతో వాళ్లను అడ్డుకునేందుకు లార్డ్స్‌లో పచ్చికతో కూడిన పేస్ పిచ్‌ను రూపొందిస్తోంది. అలాగే స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్, పేస్ ఆల్‌రౌండర్ గస్ అట్కిన్సన్‌ను ఈ మ్యాచ్ కోసం దించుతోంది. దీనిపై భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ స్పందించాడు. 'పిచ్‌పై పచ్చిక కనిపిస్తోంది. కానీ మ్యాచ్ రోజే వికెట్ ఎలా ఉంటుందనే క్లారిటీ వస్తుంది. ఇక్కడ ఎక్కువగా లోస్కోర్లు నమోదవుతాయి. బౌలర్లకు పిచ్ నుంచి మద్దతు లభిస్తూ ఉంటుంది. అయితే ఎక్కువ సేపు క్రీజులో నిలబడితే పరుగులు అవే వస్తాయి. ఇదే అప్రోచ్‌తో మేం ముందుకెళ్తాం' అని సితాన్షు కోటక్ చెప్పుకొచ్చాడు.

## నా కెరీర్‌ను మార్చింది అతడే..
## కోహ్లీ ఎమోషనల్ కామెంట్స్!




టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో అరుదైన ఘనతలు అందుకున్నాడు. పాత రికార్డులకు పాతర పెడుతూనే.. లెక్కనేనన్ని కొత్త రికార్డులు సృష్టించాడు. ప్రతి ఫార్మాట్‌లో తోపు బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. దాదాపుగా అన్ని ట్రోఫీలు అందుకున్నాడు. ఇలా కెరీర్‌ను చిరస్మరణీయం చేసుకున్నాడు. టీ20లు, టెస్టులకు రిటైర్‌మెంట్ ఇచ్చేసిన విరాట్.. ఇక మీదట వన్డేల్లో మాత్రమే మెరవనున్నాడు. తాజాగా టెస్ట్ రిటైర్‌మెంట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన స్టార్ బ్యాటర్.. తన కెరీర్ ఎలా టర్న్ తీసుకుందో కూడా బయటపెట్టాడు.టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి తన కెరీర్‌ను మార్చేశాడని అన్నాడు కోహ్లీ. 'రవిశాస్త్రితో పని చేయకపోయి ఉంటే టెస్ట్ క్రికెట్‌లో ఇదంతా సాధ్యమయ్యేది కాదు. మేం కలసి విజయాలు సాధించడానికి మాకు ఉన్న స్పష్టతే కారణమని చెప్పాలి. ఏ ఆటగాడికైనా కెరీర్‌లో ఎదిగే సమయంలో మద్దతు చాలా అవసరం. అలాంటి సపోర్ట్ నాకు రవిశాస్త్రి అందించాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో తాను ముందుండి విమర్శలు ఎదుర్కొనేవాడు. ఆయన లేకపోతే నా కెరీర్ ఇలా ఉండేది కాదు. నా క్రికెట్ ప్రయాణంలో ఎల్లప్పుడూ అండగా ఉంటూ కీలకపాత్ర పోషించినందుకు ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటా. ఆయన మీద గౌరవం ఎప్పటికీ తగ్గదు' అని చెబుతూ కోహ్లీ ఎమోషనల్ అయ్యాడు.

## గడ్డం వల్లే కోహ్లీ రిటైర్‌మెంట్..
## ఈ లాజిక్ మామూలుగా లేదుగా!




టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టులకు గుడ్‌బై చెప్పేశాడు. పొట్టి ప్రపంచ కప్-2024 సమయంలో టీ20లకు రిటైర్‌మెంట్ ఇచ్చేసిన కింగ్.. ఆ తర్వాత నుంచి వన్డేలు, టెస్టుల్లో ఆడుతూ వచ్చాడు. ఇప్పుడు సుదీర్ఘ ఫార్మాట్‌కూ దూరమయ్యాడు. ఇకపై 50 ఓవర్ల ఫార్మాట్‌లో మాత్రమే అతడి ఆటను ఆస్వాదించాల్సిన పరిస్థితి. అయితే టెస్టులకు రిటైర్‌మెంట్ ఇచ్చి చాన్నాళ్లు అవుతున్నా ఎప్పుడూ దీనిపై బహిరంగంగా స్పందించలేదు విరాట్. తొలిసారి ఈ విషయంపై అతడు నోరు విప్పాడు. రిటైర్‌మెంట్‌కు గడ్డంతో ముడిపెట్టాడు కింగ్. ఇంతకీ అతడేం అన్నాడంటే..రెండ్రోజుల కిందే నెరిసిన గడ్డానికి రంగు వేసుకున్నానని కోహ్లీ అన్నాడు. ప్రతి 4 రోజులకు ఒకసారి గడ్డానికి కలర్ వేసుకుంటున్నామంటే మన టైమ్ అయిపోయిందని అర్థం చేసుకోవాలన్నాడు విరాట్. దిగ్గజ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ లండన్‌లో నిర్వహించిన ఓ చారిటీ కార్యక్రమానికి హాజరైన కోహ్లీ.. రిటైర్‌మెంట్ నిర్ణయంలో తన వయసును ప్రధానంగా పరిగణనలోకి తీసుకున్నానని చెప్పాడు. అయితే వయసు మీద పడుతోందనే అంశాన్ని నేరుగా చెప్పకుండా గడ్డానికి రంగు వేసుకుంటున్నానంటూ జోక్ చేశాడు విరాట్.యువరాజ్, జహీర్ ఖాన్, హర్భజన్ సింగ్‌తో కలసి ఆడిన రోజుల్ని గుర్తుచేసుకున్నాడు కోహ్లీ. భారత జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకోవడంలో వీళ్లంతా సాయపడ్డారని తెలిపాడు.

# బిజినెస్



## అమెరికా ట్రేడ్ వార్..

## నష్టాలతో ముగిసిన దేశీయ సూచీలు..




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి పలు దేశాలతో ట్రేడ్ వార్‌కు తెరలేపడం అంతర్జాతీయ మార్కెట్లపై నెగిటివ్ ప్రభావాన్ని చూపెడుతోంది. ఈ రోజు (జులై 9)తో పలు దేశాలపై అమెరికా విధించిన వాణిజ్య సుంకాల డెడ్‌లైన్ ముగిసింది. ఆ డెడ్‌లైన్‌ను ఆగస్ట్ 1వరకు పొడిగించిన ట్రంప్ ఆ తర్వాత ఇంక పొడిగించేది లేదని స్పష్టం చేశారు. అలాగే కాపర్ దిగుమతులపై 50 శాతం సుంకం విధిస్తామని హెచ్చరించారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలతో రోజును ముగించాయి. (%దీబంఱఅవం చీవఓం).ంగళవారం ముగింపు (83, 712)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 100 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత లాభనష్టాలతో దోబూచులాడుతోంది. అయితే చివరి గంటలో అమ్మకాలు వెల్లువెత్తాయి. బుధవారం సెన్సెక్స్ 83, 382–83,781 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు సెన్సెక్స్ 176 పాయింట్ల నష్టంతో 83, 536 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 46 పాయింట్ల నష్టంతో 25, 476 వద్ద రోజును ముగించింది.సెన్సెక్స్‌లో పీజీ ఎలక్ట్రోప్లాస్ట్, నైకా, ఆర్బీఎల్ బ్యాంక్, మ్యాన్‌కైండ్ ఫార్మా, ఐఈఎక్స్ షేర్లు లాభాలు ఆర్జించాయి. గెయిల్ యూనియన్ బ్యాంక్, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఫియోనిక్స్ మిల్స్, వేదాంత షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 75 పాయింట్ల నష్టపోయింది. బ్యాంక్ నిఫ్టీ 42 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 85.67గా ఉంది.

## మళ్లీ గోల్డ్‌మన్ శాక్స్‌కు రుషీ సునాక్



లండన్: బ్రిటన్ మాజీ ప్రధాని రుషీ సునాక్ మళ్లీ వృత్తి బాట పట్టారు. అంతర్జాతీయ ఇన్వెస్టమెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్‌లో సునాక్ సీనియర్ సలహాదారు (అడ్వైజర్)గా చేరనున్నారని ఫైనాన్షియల్ టైమ్స్ కథనం పేర్కొంది. 2024 జూలైలో జరిగిన బ్రిటన్ ఎన్నికల్లో సునాక్‌కు చెందిన కన్జర్వేటివ్ పార్టీ ఘోర ఓటమి పాలైంది. అనంతరం సునాక్ బ్రిటన్ ప్రధాని పదవితోపాటు పార్టీ ఆధ్యక్ష హోదా నుంచీ తప్పుకున్నారు. అయితే, రిచ్‌మాండ్, నార్త్‌అల్లెర్టన్ ఎంపీగా మాత్రం కొనసాగుతున్నారు. రాజకీయాల్లో చేరక ముందు కూడా ఆయన గోల్డ్‌మన్ శాక్స్‌లోనే పనిచేశారు. 2001–2004 మధ్యకాలంలో ఆయన కంపెనీలో తొలుత సమ్మర్ ఇంటర్న్‌గా, ఆ తర్వాత జూనియర్ అనలిస్ట్‌గా పనిచేశారు. ఇప్పుడు సీనియర్ అడ్వైజర్ హోదాలో కంపెనీ యాజమాన్యం, క్లయింట్లకు భౌగోళిక రాజకీయ, ఆర్థిక సంబంధిత అంశాలపై సలహాలు ఇవ్వనున్నారు. గోల్డ్‌మన్ శాక్స్ నుంచి లభించే పారితోషికాన్ని సునాక్ తన భార్య అక్షతా మూర్తి (ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణ మూర్తి కూతురు)తో కలిసి ప్రారంభించిన రిచ్‌మాండ్ ప్రాజెక్ట్‌కు విరాళంగా ఇవ్వనున్నారు. ఈ చారిటీ సంస్థ బ్రిటన్ వాసుల్లో గణాంక నైపుణ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తోంది.

## కోవాసంట్ టెక్‌లో కోనాఏఐ డీక్యూబ్ డేటా విలీనం




హైదరాబాద్ టెక్ ప్రపంచంలో మరో విలీనం చోటు చేసుకుంది. పెద్దగా మానవ ప్రమేయం లేకుండా ఖాతాదారులకు కృత్రిమ మేధ (ఏజెంటిక్ ఏఐ) సేవలందించే కోవాసంట్ టెక్నాలజీస్.. అమెరికాకు చెందిన కోనాఏఐ, డీక్యూబ్ డేటా సైన్సెస్ కార్పొరేషన్ కంపెనీలను విలీనం చేసుకుంది. అయితే ఈ విలీనానికి సంబంధించిన లావాదేవీల వివరాలను మాత్రం ఈ కంపెనీలు వెల్లడించలేదు. విలీనం అనంతరం ఏర్పడిన కంపెనీని కోవాసంట్ టెక్‌గా వ్యవహరిస్తారు. ఏఐ ఆధారిత కంప్లయెన్స్‌లో కీలకంగా ఉన్న కోనాఏఐ, సైబర్ సెక్యూరిటీ సంస్థ డీక్యూబ్ విలీనంతో అంతర్జాతీయ క్లయింట్లకు ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ గవర్నెన్స్ సొల్యూషన్స్‌ను అందించటంతో పాటు సేవల పోర్టుఫోలియోను విస్తరించే అవకాశం లభిస్తుందని కోవాసంట్ వ్యవస్థాపకుడు సీవీ సుబ్రమణ్యం వెల్లడించారు. 2030 నాటికి ఏజెంటిక్ ఏఐ మార్కెట్ ఏటా 54 శాతం వృద్ధితో 170 కోట్ల డాలర్లకు చేరే అవకాశముందని, దీన్ని అందిపుచ్చుకునేందుకు ఈ విలీనం తోడ్పడుతుందని ఆయన తెలిపారు. మూడు కంపెనీల విలీనంతో ఏర్పడే సంస్థలో మొత్తం 400 మంది ఉద్యోగులు ఉండనున్నారు.

## కస్టమర్లకు గుడ్ న్యూస్..

# SBI తో పాటు 6 బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్ ఛార్జీలు రద్దు




మధ్య తరగతి ప్రజల జీవితం ఎన్నో సవాళ్లతో ఉంటుందని చెప్పవచ్చు. ఎందుకంటే రెంట్, రోజువారీ ఖర్చులు, పిల్లల చదువుతో మొదలుకుని అనేకం ఉంటాయి. దీనికి తోడు బ్యాంకులు విధించే కనీస బ్యాలెన్స్ రూల్ మరో భారంగా మారుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకున్న పలు బ్యాంకులు సేవింగ్ ఖాతాలకు మినిమం బ్యాలెన్స్ నిబంధనను తొలగించాయి. దేశంలోని అగ్రగామి బ్యాంకులైన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (%ూదీ×%)తో పాటు మరికొన్ని ప్రముఖ బ్యాంకులు తమ ఖాతాదారులకు కనీస బ్యాలెన్స్ విధించే ఛార్జీలను పూర్తిగా రద్దు చేశాయి. వాటిలో ఇంకా ఏ బ్యాంకులు ఉన్నాయనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

1. బ్యాంక్ ఆఫ్ బరోడా

జూలై 1, 2025 నుంచి కనీస బ్యాలెన్స్ షరతులను అన్ని సేవింగ్ ఖాతాలపై విధించే ఛార్జీని బ్యాంక్ ఆఫ్ బరోడా రద్దు చేసింది. కానీ, ప్రీమియం సేవింగ్ ఖాతా పథకాలపై ఈ ఛార్జీని రద్దు చేయలేదు.

2. ఇండియన్ బ్యాంక్ బ్యాంక్

ఇండియన్ బ్యాంక్ కూడా కనీస బ్యాలెన్స్ ఛార్జీని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. జూలై 7, 2025 నుంచి అన్ని రకాల సేవింగ్ ఖాతాలపై కనీస బ్యాలెన్స్ ఛార్జీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

3. కెనరా బ్యాంక్

ఈ సంవత్సరం మే నెలలో సాధారణ సేవింగ్ ఖాతాలతో సహా అన్ని రకాల పొదుపు ఖాతాలపై కనీస బ్యాలెన్స్ ఛార్జీని కెనరా బ్యాంక్ రద్దు చేసింది. వీటిలో శాలరీ, %చీ=×% సేవింగ్ ఖాతాలు కూడా ఉన్నాయి.

4. పంజాబ్ నేషనల్ బ్యాంక్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ అన్ని రకాల సేవింగ్ ఖాతాలపై కనీస బ్యాలెన్స్ ఛార్జీని రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బ్యాంకు కస్టమర్లకు ఇది నిజంగా గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు.

5. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

2020 నుంచి కనీస బ్యాలెన్స్‌ను వసూలు చేస్తున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పుడు దానిని కూడా రద్దు చేసింది. అంటే, ఇప్పుడు సేవింగ్ ఖాతాలో కనీస బ్యాలెన్స్ పాటించకపోయినా ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరు.

6. బ్యాంక్ ఆఫ్ ఇండియా

మినిమం బ్యాలెన్స్ విషయంలో సేవింగ్ ఖాతాలకు కస్టమర్ల నుంచి ఎటువంటి ఛార్జీలు వసూలు చేయకూడదని బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా నిర్ణయించింది. దీని ప్రకారం మారుతున్న మార్కెట్ పరిస్థితులు, ఆర్థిక సౌలభ్యాన్ని పెంచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

## పసిడి ప్రియులకు షాక్..

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు..

బంగారానికి మహిళలకు కొన్ని వేల ఏళ్ల నుంచి అవినాభావ సంబంధం ఉంది. ఆడవాళ్లు తమ దగ్గర ఎంత బంగారం ఉన్నా.. ఇంకా కావాలంటారే తప్ప వద్దు అనరు. శుభకార్యాల్లో బంగారం విషయాలే ప్రధాన టాపిక్ అవుతాయి. భారతీయ సంస్కృతిలో ఓ భాగం అయిన బంగారం ధరలు పేద, మధ్య తరగతి వాళ్లకు షాక్ ఇస్తున్నాయి. రోజు రోజుకు పెరుగుతూ పోతున్నాయి. ప్రస్తుతం 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 99వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.హైదరాబాద్ మహా నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,600 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,840 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,130 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 98,850 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 90,610 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,140 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.




## జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు నా హయాంలోనే షురూ




ముంబై: మోసపూరిత ట్రేడింగ్ వ్యూహాల ద్వారా భారత స్టాక్ మార్కెట్ నుంచి అక్రమంగా రూ.వేల కోట్లు ఆర్జించిన అమెరికన్ హెడ్జ్ ఫండ్ కంపెనీ జేన్ స్ట్రీట్‌పై దర్యాప్తు తన హయాంలోనే మొదలైందని సెబీ మాజీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ మంగళవారం అన్నారు. 2024 ఏప్రిల్ నుంచే జేన్ స్ట్రీట్ ట్రేడింగ్ విధానాలపై విచారణను ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే, జేన్ స్ట్రీట్ ఉదంతాన్ని నియంత్రణ వైఫల్యంగా చిత్రీకరించడం దురదృష్టకరమని ఆమె పేర్కొన్నారు. జేన్ స్ట్రీట్ మార్కెట్ సూచీలను కృత్రిమంగా ప్రభావితం చేసినట్లు గుర్తించడంతో పాటు అనైతిక ట్రేడింగ్ వ్యూహాలకు స్వస్తి పలకాలంటూ 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి మధ్య కాలంలో కంపెనీకి సర్క్యులర్లు, హెచ్చరికల జారీ సహా పలు చర్యలను సెబీ చేపట్టిందన్నారు. సెబీ సారథ్యం నుంచి బుచ్ ఈ మార్చిలో తప్పుకున్నారు. ఆమె స్థానాన్ని తుహిన్ కాంత పాండే భర్తీ చేశారు. కాగా, జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ గత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, రూ.4,843 కోట్ల అక్రమ లాభాలను తిరిగి తమ ఎస్క్రో ఖాతాలో జమ చేయాలని నియంత్రణ మండలి ఆదేశించింది. కంపెనీపై సెబీ అభియోగాలను తోసిపుచ్చిన జేమ్‌స్ట్రీట్.. నియంత్రణ మండలి ఆదేశాలను చట్టపరంగా సవాలు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. కాగా, తాను అక్రమంగా లబ్ది పొందేందుకు మార్కెట్ సూచీలను కృత్రిమంగా ప్రభావితం చేయడం ద్వారా చిన్న ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు మిగిల్చిన జేమ్ స్ట్రీట్‌పై క్రిమినల్ చర్యలు చేపట్టాలని కొందరు మార్కెట్ వర్గాలు డిమాండ్ చేస్తున్నారు. ఏదైనా కంపెనీపై క్రిమినల్ చర్యలు చేపట్టేందుకూ నియంత్రణ మండలికి సెబీ చట్టం అధికారం కల్పిస్తుందని న్యాయ విశ్లేషకులు పేర్కొన్నారు.

## ఈ మెసేజింగ్ యాప్‌కు ఇంటర్నెట్ అవసరం లేదు

న్యూయార్క్: 'ఎక్స్'గా పేరు మార్చుకున్న సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విటర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సే బిట్‌చాట్ పేరుతో సరికొత్త మెసేజింగ్ యాప్‌ను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం బీటా వెర్షన్‌లో అందుబాటులో ఉన్న ఈ అప్లికేషన్ ద్వారా సందేశాలు పంపేందుకు ఇంటర్నెట్, వైఫై, మొబైల్ నెట్‌వర్క్, ఫోన్ నంబరు, సర్వర్లు, యూజర్ ఐడీ లాంటివేమీ అవసరం లేదు. సమాచార గోప్యతకు అత్యంత ప్రాధాన్యమిచ్చేందుకు బ్లూటూత్ సాంకేతికత ఆధారంగా పనిచేసే ఆఫ్ గ్రిడ్ పీర్–టు–పీర్ మెసేజింగ్ (ఒక వ్యక్తి మరో వ్యక్తికి సందేశాలు పంపే) ప్లాట్‌ఫామ్ ఇది. అంటే, టెలికమ్యూనికేషన్ నెట్‌వర్క్ లేని సమయంలోనూ బ్లూటూత్ మెష్ నెట్‌వర్క్ ద్వారా ఈ యాప్ నుంచి ఒక వ్యక్తి తన సమీప వ్యక్తికి సందేశం పంపేందుకు వీలుంటుందన్నమాట. వాట్సాప్, మెసెంజర్ వంటి సెంట్రలైజ్డ్ (కేంద్రీకృత)

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006